రాష్ట్రంలో తుగ్లక్ పాలన

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : రాష్ట్రంలో కాంగ్రెస్ పేరిట ఔరంగజేబు సర్కారు పాలన కొనసాగుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహాలు పెట్టనివ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని, మరోవైపు హిందువులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించవద్దని, మెజార్టీ ప్రజలను వేధించవద్దన్నారు. హిందువులపై దౌర్జన్యాలు చేసే వారి పేర్లను కాషాయ బుక్కులో నోట్ చేసుకుంటున్నామని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వడ్డీతో సహా లెక్క చెబుతామన్నారు. నాడు ధర్మ పరిరక్షణ కోసం ఛత్రపతి కృషి చేశారని, పరమత సహనాన్ని పాటించారని తెలిపారు. నేటి యువత ఛత్రపతి శివాజీ చరిత్రను తెలుసుకోవాలన్నారు. శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీడీ చవాన్ మాట్లాడుతూ వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి ఎక్కె అరుదైన ఫీటుకు శ్రీకారం చుడుతున్నారు. ఈనెల 19న శివాజీ జయంతి సందర్భంగా 100 ప్రాంతాల్లో ఏకకాలంలో శివాజీ పూజను నిర్వహిస్తున్నామని తెలిపారు.

అనంతరం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో శివ స్వామి, సుదీప్, అనంతలక్ష్మి, రమేష్, విజయ్, నవరత్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, సీడీ చవాన్ తదితరులు

ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

హిమాయత్‌నగర్ ,ఫిబ్రవరి 15: రాష్ట్రంలోని విద్యుత్ రంగంలో పనిచేసే ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరంతరం వెలుగులు నింపుతున్న విద్యుత్ రంగ ఆర్టిజన్ కార్మికులకు ఏండ్ల తరబడి పదోన్నతులు లేకపోవడం, వేతనాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఈ సంస్థలో పని చేసే 22వేల మంది కార్మికులకు వారి వారి స్థానాల్లో పదోన్నతులతో పాటు పర్మినెంట్ చేయాలన్నారు.ఆర్టిజన్ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

నేటి నుంచి కులగణన రీసర్వే ప్రారంభం

బండ్లగూడ, ఫిబ్రవరి 15. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం నుంచి కులగణన రీ సర్వే నిర్వహించనున్నట్లు కమిషనర్ శరత్‌చంద్ర శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాలనుసారం ఈ నెల 16 నుంచి 28వరకు నిర్వహించనున్న కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ కుటుంబ సభ్యుల వివరాలను అందజేయాలని కోరారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా పాలన కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో కుటుంబ సభ్యుల వివరాలు ఇవ్వనివారు ఇప్పుడు తమ కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రతి విద్యార్థికి ఓపిక, పట్టుదల ఉండాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15: బాగ్లింగంపల్లి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాలలో సెల్ఫ్ ఎంపైర్మెంట్ ఫర్ సక్సెస్ అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రహ్మకుమారిస్ ప్రతినిధి డాక్టర్ బి.కె శ్రీలత హాజరై మాట్లాడారు. ఓపిక పట్టుదల ధైర్యమును ప్రతి విద్యార్థి అలవార్చుకోవాలని సక్సెస్ అనేది మన వెంట ఉంటుందన్నారు. ప్రతి వ్యక్తి మంచి వ్యక్తిత్వాన్ని కలిగి క్రమశిక్షణను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమములో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వై విష్ణుప్రియ ప్రిన్సిపల్ డాక్టర్ మట్ట శేఖర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు- తొలగించిన ఫ్లెక్సీలు

బండ్లగూడలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

బండ్లగూడ, ఫిబ్రవరి 15: నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు బండ్లగూడలో ఫ్లెక్సీలను తొలగించారు. గత వారం రోజుల క్రితం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ భవనంతో పాటు మంచినీటి ఫిల్టర్ బెడ్లను ప్రారంభించేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ తో పాటు మంత్రి శ్రీధర్ బాబులు వచ్చిన సందర్భంగా స్థానిక నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు రాకపోకలకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్న మేరకు నమస్తే తెలంగాణ దినపత్రికలో వారం రోజు లు గడుస్తున్నా ఫ్లెక్సీలు తొలగించలేదు ఆ వార్తకు కమిషనర్ శరత్‌చంద్ర తమ సిబ్బందికి ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15: ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తున్న ఆక్రమణలను శనివారం జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రహదారిపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ సమక్షంలో ఈ తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల భారీ బందోబస్తు నడుమ జేసీబీ సహాయంతో షెడ్లను కూల్చి వేశారు.అనంతరం టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ మాట్లాడుతూ కాటేదాన్ ఓల్డ్ కర్నూలు రహదారి ఎప్పుడు రద్దీగా ఉంటుందన్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకొని పుట్‌పాత్‌లను ఆక్రమించి షెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. దీని కారణంగా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ఆక్రమించిన షెడ్లను తొలగించామన్నారు.

సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలపై ప్రేమ ఉంటే తన పదవికి రాజీనామా చేసి ఆ సీటును వారికి కేటాయించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సమగ్రంగా లేదన్నారు. కులగణన సర్వే అగ్రవర్ణాలకు ప్రయోజనం చేసేలా ఉందని, బీసీలను అన్యాయం చేసినట్లు ఉందన్నారు. 2014 లో 8 శాతం ఉన్న అగ్రవర్ణాలను ఇప్పుడు 15 శాతం చూపించడం వెనుక ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకోవడానికేనని విమర్శించారు. బీజేపీ మొదటి నుండి బీసీలకు ఫలాలు అందకుండా చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రసపల్లి కళ్యాణ్, నిరంజన్ కుమార్, అభినయ్,వరుణ్ సాగర్, రాంతేజ, భానుచందర్ పాల్గొన్నారు.

సోమాజిగూడలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కామేష్

సమగ్రకుల గణనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 15 : దేశవ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్రం తగిన చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి. వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనంజయ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తయిన వెంటనే బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి కేంద్రానికి పంపించాలన్నారు. రాజకీయ రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కులగణనపై రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి కులగణనకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

మణికొండ, ఫిబ్రవరి 15: సామాజిక,ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ, కుల సర్వే కొరకు నార్సింగి మణికొండ మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కావున ఇంతకు ముందు నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారు ఎవరైనా ఉంటే ఇప్పుడు నిర్వహించబోయే కులగణన రీ సర్వేలో పాల్గొన్నాలని కోరారు. ఈ కార్యక్రమం ఈనెల 28 వరకు ఈ కౌంటర్లలో దరఖాస్తులను స్వీకరిస్తామని వారు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బండ్లగూడ, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తామని గండిపేట మండల సీఐటీయూ కన్వీనర్ డప్పు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్ ఆటో యూనియన్ అధ్యక్షులు బ్యాగరి బాలరాజ్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ గండిపేట్ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్ కుమార్ విచ్చేసి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ఎలాంటి హామీలను అందించలేదన్నారు. తమ ఇబ్బందులను తెలియజేసేందుకు ఆటో డ్రైవర్ యూనియన్లు,పలు మార్లు రాష్ట్ర నాయకులకు వినతి పత్రాలు ఇచ్చినా చర్చలకు పిలవకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో గ్రామస్థాయి నుంచి జిల్లా,రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లను నడిపిస్తే కఠిన చర్యలు

పొల్యూషన్ బోర్డు అధికారుల హెచ్చరిక

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : సీజ్ చేసిన రెడీమిక్స్ ప్లాంట్లను నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని పొల్యూషన్ బోర్డు అధికారులు హెచ్చరించారు. శనివారం శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్లు రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు సీజ్‌చేసిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు సీజ్‌చేసినా కొన్ని ప్లాంట్లు నడుస్తున్నట్లు స్థానికుల సమాచారంతో శనివారం రెవెన్యూ అధికారులతో కలిసి పొల్యూషన్ బోర్డు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న అనుమతిలేని 21 రెడీమిక్స్ ప్లాంట్లను సీజ్ చేశామన్నారు. వాటిలో ఎవరు తిరిగి నడిపించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలో సీజ్ చేసిన రెడీమిక్స్ ప్లాంట్లను పరిశీలిస్తున్న పొల్యూషన్ బోర్డు, రెవెన్యూ అధికారులు

కార్మికుల హక్కుల సాధన కోసం కృషి

హిమాయత్ నగర్ , ఫిబ్రవరి 15: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కార్మికులకు కీర్తి శేషులు కె.సత్యనారాయణ అందించిన సేవలు మరువలేనివని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ యూనియన్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. నర్సింహ అన్నారు. సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలకు పైగా జలమండలి కార్మికులతో పాటు వివిధ కంపెనీ కార్మికుల శ్రేయస్సు కోసం సత్యనారాయణ సేవలు అందించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు ఆనంద్, సర్వేశ్, మురళికృష్ణ, పరమేశ్, మురళి పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో సత్యనారాయణ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టీబీ ఫ్రీ ఇండియా సమావేశంలో పాల్గొన్న వైద్య అధికారులు, సిబ్బంది

టీబీ నివారణకు ఇంటింటి సర్వే

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15: టీబీ ఫ్రీ ఇండియా కార్యక్రమంలో భాగంగా క్షయ నివారణకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. టీబీ రహిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు క్షయ లక్షణాలను గుర్తించేందుకు జిల్లా వైద్య శాఖ, టీబీ అలెర్ట్ ఇండియా సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం శ్రీరామ్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు.

ఎస్పీహెచ్ఓ డాక్టర్ విజయ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఆశ్రిత (శ్రీరామ్ నగర్), డాక్టర్ మమత (బోరబండ), డాక్టర్ సుభాన్ (వినాయక్ నగర్), టీబీ అలెర్ట్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకున్న గ్రామస్తులు

గొల్లపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిలో నాటిన కడీలను తొలగించిన వాటిని చూపుతున్న గొల్లపల్లి గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నిస్తున్నట్లు తెలువడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడ్డుకున్నట్లు తెలిపారు. శనివారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి రెవెన్యూ పరిధిలోని 261లో దాదాపు 10 ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు కబ్జాకు యత్నిస్తున్నారని తెలుసుకున్న ఆఊరి గ్రామస్తులు అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ గొల్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 261కి ఆనుకొని ఉన్న భూమికి సంబంధించిన వ్యక్తులు కడీలను తొలగించి డోజర్లతో చదును చేస్తున్నారని వివరించారు. తాము అడ్డుకోవడంతో వారు ఇక్కడి నుంచి వెళ్లిపోయారని వివరించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేయగా వారు అక్కడికి చేరుకొని కడీలను నాటిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

దూరవిద్య డిగ్రీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రీవాల్యుయేషన్ కు ఒక్కో పేపర్కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 19వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి 21వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

రేపటి నుంచి కంటి పరీక్షలు

యూసుఫ్‌గుడాబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో కంటి స్క్రీనింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేత్ర వైద్య చికిత్సలు నిర్వహించనున్నట్లు శ్రీరామ్ నగర్ ఎస్పీహెచ్ఓ డాక్టర్ బి. విజయ నిర్మల పేర్కొన్నారు. శనివారం పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించేందుకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో స్క్రీనింగ్ క్యాంప్ లు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా క్యాంప్ లలో కంటి సమస్యలు ఉన్న 850 మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను సోమవారం నుంచి నేత్ర వైద్య నిపుణులతో అవసరమైన చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు.

యువత మానసిక ఒత్తిడిని అధిగమించాలి

సైకలాజికల్ డాక్టర్ ఎంఏ కరీం

బండ్లగూడ, ఫిబ్రవరి 15: పోటీ ప్రపంచంలో మారుతున్న కాలంతో పాటు నేటి యువతీ యువకుల ఆలోచనల్లో మార్పు అవసరం ఉందని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ సైకలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం పేర్కొన్నారు. యువత జీవితంలో విజయాలు సాధించాలంటే చేసే పనిమీద శ్రద్ధ పట్టుదల ఉండాలని చేసే ప్రయత్నంలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతాయని అలాంటి సమయం లో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లను అధిగమించాలని ఆయన తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ లోని తెలంగాణ కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో యువజన, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువత మనోవికాసానికి దోహదపడే విధంగా నిర్వహించిన మానసిక అవగాహన సదస్సులో సీనియర్ సైకలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ.కరీం ప్రధాన శిక్షకులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భావి జీవితం లో ఇతరుల మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించడానికి తగిన ప్రాథమిక నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో ప్రయోగాత్మక ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన అధికారిని ఖుష్బూ గుప్తా, ప్రోగ్రాం అధికారి యాదగిరి, యువజన సర్వీసుల శాఖ అధికారులు సిబ్బందితోపాటు యువతీ యువకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్ వాసుల కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. మరికొద్ది నెలల్లో మున్సిపల్ ఎన్నికల నగరా మొగనున్న నేపథ్యంలో బస్తీలో శనివారం రూ. 42.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. గత ఏడాదిన్నర కాలంగా ప్రేమ్‌నగర్‌లో గతుకుల రోడ్లు, సీవరేజీ సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాగా, రూ. 22.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మాణ పనులు, రూ. 20 లక్షల వ్యయంతో నూతన సీవరేజీ లైన్ నిర్మాణ పనులు చేపట్టనుండటంతో ఈ పనులన్ని ఎన్నికలు రాకముందే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ -18 డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివ కుమార్, ప్రేమ్ నగర్ బస్తీ నాయకులు టి. వెంకటేశం, కే .భగవాన్ దాస్, దయానంద్ యాదవ్, ప్రవీణ్ కుమార్, శ్రీధర్ యాదవ్, మహిళా నాయకురాలు గంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి తదితరులు

సైఫాబాద్ పీజీ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సునీత మంజరి

సైఫాబాద్ పీజీ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ గా డాక్టర్ సునీత మంజరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె కెమిస్ట్రీ విభాగానికి చెందినవారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

– ఉస్మానియా యూనివర్సిటీ

బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శం

హిమాయత్ నగర్, ఫిబ్రవరి15: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ స్వర్గీయ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ధర్మభిక్షం 103వ జయంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ధర్మభిక్షం విద్యార్థి దశ నుంచే క్రియాశీలక పాత్ర పోషించారని, మనిషిని మనిషి గా గుర్తించి, గౌరవించడంలో ఆదర్శప్రాయుడని వారు కొనియాడారు. సమ సమాజమే లక్ష్యంగా అణగారిన వర్గాల్లో చైతన్యం రగిలించిన అవిశ్రాంత పోరాట యోధుడు ధర్మభిక్షం అని అన్నారు. సూర్యపేట కేంద్రంగా ఆనాడే హాస్టళ్లను తెరిచి అనేక మంది చదువుకునేందుకు అవకాశం కల్పించగా ఆయన శిష్యులే అన్ని రాజకీయ పార్టీల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. ఉద్యమాలకు నిలువుటద్దం ధర్మభిక్షం అన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో నడవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకురాలు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలుగౌడ్, సమన్వయ అధ్యక్షుడు బి. నాగ భూషణం, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, నేతలు మారుపాక అనిల్ కుమార్, సదానంద్, బి. వేణు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి

బీసీ హక్కుల కోసం ఉద్యమిస్తాం

ముషీరాబాద్, ఫిబ్రవరి15: జాతీయ స్థాయిలో బీసీ హక్కుల కోసం ఉద్యమిస్తామని బీసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లు మహేందర్ తెలిపారు. శనివారం బీసీసంక్షమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన బీసీ సమస్యలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని, సామాజిక అసమనతలు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.

సంత్ సేవాలాల్‌ను.. ఆదర్శంగా తీసుకోవాలి

మైలార్‌వదేవ్‌పల్లి, ఫిబ్రవరి 15: మైలార్‌వదేవ్‌పల్లి డివిజన్ పరిధిలో శనివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాబుల్ రెడ్డి నగర్ లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి సందర్భంగా మైలార్‌వదేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, కిషన్, లక్ష్మణ్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బాబుల్ రెడ్డి నగర్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయక